భగీరథ నీళ్లత్తలేవ్..!

- గొల్లగూడెంకు నిలిచిన నీటి సరఫరా
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



ఓ ఇంటి వద్ద అలంకారప్రాయంగా భగీరథ నల్లా

దండేపల్లి: మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లా నీళ్లు అందిస్తున్నామని, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు తమ ప్రసంగాల్లో గొప్పలు చెపుతుంటారు. కానీ అది కొన్నిచోట్ల పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చడం లేదు. దండేపల్లి మండలం తాళ్లపేట పంచాయతీ పరిధిలోని గొల్లగూడెంకు మిషన్ భగీరథ నీళ్లు గత కొద్ది రోజులుగా రావడం లేదని అక్కడి ప్రజలు వాపోయారు. గొల్లగూడెంలో 26కుటుంబాలు, సుమారు 140కి పైగా జనాభా నివాసం ఉంటున్నారు. ఇక్కడికి భగీరథ నీళ్లను సరఫరా చేసేందుకు తాళ్లపేట నుంచి జైతుగూడకు వెళ్లేదారి పక్కన నీళ్ల ట్యాంకును ఏర్పాటు చేశారు. దీంతో గూడెంకు నీళ్ల ట్యాంకుకు మధ్య దూరం పెరగడంతో, గొల్లగూడెంకు భగీరథ నీళ్లు రావడం లేదు. ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇచ్చినప్పటికీ నీళ్లు రాకపోవడంతో అవి అలంకార ప్రాయంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ గూడెంకు భగీరథ నీళ్లు అందించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం గూడెంలోని ఓ చేతి పంపునకు మోటారు ఏర్పాటు చేసి, దానికి నల్లాలు ఏర్పాటు చేశారు. కానీ ఇంటింటికీ నీళ్లు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కరిస్తాం

గొల్లగూడలో భగీరథ నీళ్లు అందించేందుకు చర్యలు చేపడతాం. నీళ్ల ట్యాంకుకు, గూడానికి మధ్య దూరం ఎక్కువగా ఉంది. దీంతో నీటి సరఫరా జరిగినప్పుడు, చివరి దాకా వెళ్లకపోవడంతో అక్కడి వాళ్లకు నీళ్లు అందడం లేదు. వీలైతే డైరెక్ట్ పంపింగ్ సిస్టం ఏర్పాటు చేసి, నీళ్లు అందించి సమస్యను పరిష్కరిస్తాం.

– శిరీష, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ

నీళ్లు అత్తలేవు..



ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇచ్చిండ్రు కానీ, నీళ్లయితే అత్తలేవు. నీళ్లు ఇస్తే మంచిది.. లేకుంటే నల్లాలు పెట్టి కూడా ఫలితం లేదు. మా గూడెంలో కొందరికి మంచినీటి బావులు లేవు, నల్లా నీళ్లత్తే వాళ్లకు ఇబ్బంది ఉండదనుకుండ్రు, కానీ నీళ్లు రాక బావులు లేనోళ్లు ఇబ్బంది పడుతుండ్రు.

– చెరుకు లక్ష్మి, గొల్లగూడెం

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



మా గూడెంకు భగీరథ నీళ్లు అత్తలేవని, గతంలో ఒకసారి పంచాయతీ సిబ్బంది, సర్పంచ్ దృష్టికి తీసుకుపోయినం. అప్పుడు కొద్దిరోజులు వచ్చినవి, మళ్లీ రావడం లేదు. మా గూడెంకి నీళ్ల ట్యాంకు దూరంగా ఉండటంతో, నీళ్లు అత్తలేవు. సమస్యను పరిష్కరించాలి.

– గొట్ల మల్లేష్, గొల్లగూడెం

క్లుప్తంగా

అలరించిన కవి సమ్మేళనం

మంచిర్యాలఅర్బన్: స్థానిక సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో ఆదివారం సంగీత సాహిత్య సుధావాహిని ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. 'దీపావళి పండుగ' అంశంపై పలువురు కవితాగానం చేశారు కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు శ్రీనాథ్‌గౌడ్, కవులు, రచయితలు మలయశ్రీ, దక్షిణమూర్తి, రాజేశం, పట్వర్ధన్, సంతోష్, సుబ్బాయమ్మ, అర్పిత తదితరులు పాల్గొన్నారు.

మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ కన్వీనర్ ఎన్నిక

కోటపల్లి: మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ కన్వీనర్ ఎన్నికను ఆదివారం చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ విష్ణుమాదిగ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మాదిగ స్టూడెంట్ కన్వీనర్‌గా మండలానికి చెందిన అంబలా రవితేజ, కో కన్వీనర్‌గా విష్ణులను నియమించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌ఛార్జీ గుండా థామస్, నాయకులు తుంగరమేశ్, రవీందర్, వెంకన్న పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

లక్సెట్టిపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్టు ఫ్యాకల్టీకి దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ జై కిషన్ ఓజా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భౌతికశాస్త్రం బోధించుటకు పోస్టు ఖాళీగా ఉందని అభ్యర్థులు 55శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో పీజీ ఉండాలని సెట్, నెట్ ఉన్నవారికి అవకాశం ఉంటుందన్నారు. ఈ నెల 7వ తేదీన కళాశాలలో సాయంత్రం లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ప్రమాదకరంగా మ్యాన్ హోల్



రామునిచెరువు ఎంట్రన్స్ వద్ద ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్

మంచిర్యాలటౌన్: పట్టణంలోని రాముని చెరువు ఎంట్రన్స్ ఆర్చి ముందు ప్రమాదకరంగా మ్యాన్ హోల్ ఉంది. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం సమయాల్లో వందలాది మంది రామునిచెరువు కట్టపై వాకింగ్ కోసం వస్తుండగా, మ్యాన్‌హోల్‌ను గమనించకుండా వెళ్తే అందులో పడే ప్రమాదం ఉందని, దానిని సరిచేయాలని రామునిచెరువు వాకర్ సభ్యులు కోరుతున్నారు.

సన్మానం

పాతమంచిర్యాల: వాడబలిజ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న బోడెంకి మహేష్ బీసీ సంఘాల ఐక్యవేదిక పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలో మహేష్‌ను పూలమాలలు శాలువాలతో వాడబలిజ సేవా సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. కుల సంఘాల, బీసీల సమస్యల కోసం పోరాటం చేస్తున్న మహేష్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో వాడబలిజ సేవా సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎర్రోళ్ల మల్లయ్య, రాష్ట్రకమిటీ సభ్యులు గారె శంకర్, పట్టణ ప్రధాన కార్యదర్శి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భాగవత సప్తాహం ముగింపు



కన్నెపల్లిలో భాగవత గ్రంథాలను కోలాటం చేస్తూ ఊరేగిస్తున్న భక్తులు

భీమిని: మానవుడు జ్ఞానాన్ని సంపాదించడంపై మాత్రమే దృష్టిని కేంద్రీకరించాలని బ్రహ్మశ్రీ మారుపాక సత్యనారాయణశర్మ అన్నారు. కన్నెపల్లి మండల కేంద్రంలో ఆదివారం భాగవత సప్తాహం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఏడు రోజులుగా భాగవత స్లోకాలను వివరించారు. ఈ సప్తహ కార్యక్రమం గత నెల 28న ప్రారంభమై ఈ నెల 5న ముగియడంతో భాగవత్ గ్రంథాలు మహిళల కోలాటల మధ్య ముగింపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం లక్ష్మీ వేంకటేశ్వర కల్యాణం నిర్వహించారు. భక్తులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పొలాలకు వెళ్లే దారికి మరమ్మతు

నెన్నెల: మండలంలోని గొల్లపల్లిలో ఎర్ర చెరువు ఆయకట్టుకు వెళ్లే దారికి గొల్లపల్లి సర్పంచ్ ఇందూరి శశికళ ఆదివారం జేసీబీతో మరమ్మతులు చేయించారు. పంట పొలాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, కనీసం ఎడ్లబండ్లు కూడా వెళ్లలేని పరిస్థితి ఉందని రైతులు సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సర్పంచ్ వెంటనే జేసీబీతో దారికి మరమ్మతు చేసి పొలాలకు వెళ్లేందుకు రవాణా సౌకర్యం కల్పించారు. పొలాలకు దారి సౌకర్యం కల్పించిన సర్పంచ్‌కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ వస్తే కార్మికులకు న్యాయం

- మంచిర్యాల కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొక్కిరాల ప్రేంసాగర్‌రావు



టీకానపల్లిలో మాట్లాడుతున్న ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్/మంచిర్యాలఅర్బన్/నస్పూర్/దండేపల్లి/లక్సెట్టిపేట: ప్రజల సహకారంతో ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు తథ్యం అని మంచిర్యాల కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొక్కిరాల ప్రేంసాగర్‌రావు తెలిపారు. మంచిర్యాల ఆర్టీసీ డిపో, దండేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ హామీలను ప్రజలకు వివరించారు. చేతి గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ వస్తేనే న్యాయం జరుగుతుందని ఆర్టీసీ కార్మికులకు వివరించారు. నస్పూర్ సీసీసీ కార్నర్ వద్ద ఎంఎం గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో పలు పార్టీలకు చెందిన సుమారు వెయ్యి మంది కార్యకర్తలు, సింగరేణి రిటైర్డ్ కార్మికులు, దండేపల్లిలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు, జిల్లా కేంద్రంలోని తన నివాసంలో జిల్లాలోని ఎక్స్ సర్వీస్‌మెన్ సభ్యులు కాంగ్రెస్‌లో చేరగా, వారికి ప్రేంసాగర్‌రావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. లక్సెట్టిపేట మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో, తిమ్మాపూర్‌లో కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేశారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం టీకానపల్లిలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రేమ్‌సాగర్‌రావు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు డప్పు చప్పుళ్లు, నృత్యాలతో పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తూ కాంగ్రెస్‌కు మద్దతుగా నిలవాలని కోరారు. ముల్కల్ల గ్రామం నుంచి పలువురు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరారు.

గడపగడపకూ బీజేపీ ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న రఘునాథ్‌రావు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని కృష్ణాకాలనీలో బీజేపీ ఆధ్వర్యంలో గడపగడపకూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంచిర్యాల బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెరబెల్లి రఘునాథ్ హాజరై కమలం గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. క్వార్టర్లకు మురికి నీరు వస్తున్నాయని, దీంతో కార్మిక కుటుంబాలు అస్వస్థతకు గురవుతున్నారన్నారు. కార్మికుల పిల్లల కోసం సరైన విద్యాసంస్థలు లేవని, కార్మికులు కష్టపడి సంపాదించిన లాభాల నుంచి కార్మికులకు కావాల్సిన కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే దివాకర్ రావు కార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలేశారన్నారు. ఈ సందర్భంగా మూడో వార్డుకు చెందిన పలువురు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సత్రం రమేష్, ఈర్ల సదానందం, బరుపాటి మారుతి, మిట్టపల్లి మొగిలి, జంగపెల్లి మహేష్, రానవేణి శ్రీను, కుర్రే చక్రి, సిరికొండ రాజు, అంబాలా సాగర్, తడూరి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: మండలంలోని ముత్యంపేటకు చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన బోడకుంటి వెంకటేష్ ఆదివారం బీజేపీలో చేరాడు. ఆయనకు పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అంటేనే ప్రజా సంక్షేమం, అభివృద్ధి

- మంచిర్యాల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దివాకర్‌రావు




28వ వార్డులో ప్రచారంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత రెండుసార్లు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని చూసి మరోసారి బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని మంచిర్యాల బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని 12వ వార్డు, 28వార్డుల్లో ఆదివారం ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందనర్భంగా వచ్చే ఎన్నికల్లో గెలుపొందితే బీఆర్‌ఎస్ పార్టీ ప్రజలకు ఏయే పథకాలను అందిస్తుందో బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. నవంబర్ 30వ తేదీన జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పల్లపు సాయి భార్గవి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, మాజీ అధ్యక్షుడు పల్లపు తిరుపతి, నాంపల్లి శ్రీనివాస్, సాగర్, జూపాక సుధీర్ పాల్గొన్నారు.

'శ్రీరాంపూర్‌లో బీఆర్‌ఎస్ ప్రచారం'

శ్రీరాంపూర్: ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం శ్రీరాంపూర్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. 7వ వార్డులో ఆ పార్టీ యువ నాయకులు నడిపెల్లి విజిత్‌రావు ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ మంచిర్యాల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా దివాకర్‌రావును మరోసారి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా టీడీపీకి చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, మాజీ సర్పంచ్ మల్లెత్తుల రాజేంద్రపాణి, కౌన్సిలర్ మహేశ్, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, పెట్టం నరేశ్, సమ్మయ్య, తిరుపతి, నగేశ్‌లు పాల్గొన్నారు.

నేతకానీలు ఐక్యంగా పోరాడాలి



జన్నారం: నేతకానీ కులస్తులు ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని నేతకానీ సంఘం రాష్ట్ర నాయకులు దుర్గం శేఖర్, ప్రభుదాస్ అన్నారు. మండలకేంద్రంలో సంఘ నాయకుల సమావేశంలో ఆదివారం మాట్లాడారు. నేతకానీ కులస్తులకు ప్రాధాన్యం ఇచ్చిన పార్టీలకే మద్దతు తెలుపాలని నిర్ణయించారు. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, నామినేటెడ్ పదవులలో ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో సంఘ నాయకులు రాజేశ్వర్, ప్రసాద్‌నేత, రాజిరెడ్డి, నారాయణ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

కాసిపేట: మండలంలోని దేవాపూర్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి ఆధ్వర్యంలో మైనార్టీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 30మంది మైనార్టీ యువకులు పార్టీలో చేరి కండువాలు కప్పుకున్నారు. కార్యక్రమంలో మద్దిమాడ సర్పంచ్ ఆడె జంగు, బీఆర్‌ఎస్ నాయకులు వడ్లూరి మల్లేష్, గడ్డం పురుషోత్తం, అనంతరావు, కనక రాజు, ధర్మరావు, నారాయణ,రెహమాన్, హైదర్ పాల్గొన్నారు.

'అవినీతి నిరోధక, మతోన్మాద పార్టీలను ఓడించాలి'

బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో అవినీతి నిరోధక, మతోన్మాద పార్టీలను చిత్తుగా ఓడించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బెల్లంపల్లి ఇఫ్టూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో అధికారం చెలాయిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం అప్పుల పాల్జేసిందని, ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసిందని విమర్శించారు. రూ.లక్ష కోట్లు దిగమింగారని ఆరోపించారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను పోరాటాలతో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. నాయకులు ఎండీ చాంద్‌పాషా, శ్రీనివాస్, మనోహర్, చంద్రన్న, రాజక్క, కృష్ణవేణి పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఎమ్మెల్యేగా నర్సయ్యను గెలిపించాలి

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఎమ్మెల్యేగా బీఎస్పీ పార్టీ తరపున పోటీచేస్తున్న నేతకానీ బిడ్డ జాడి నర్సయ్యను అధిక మెజార్టీతో గెలిపించాలని నేతకానీ మహార్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాడి ప్రేమ్‌సాగర్ కోరారు. బెల్లంపల్లిలో ఆదివారం జరిగిన నేతకానీ మహార్ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బహుజన రాజ్యం ఏర్పడాలన్నారు. ఇందుకు బీఎస్పీ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలిసిన అవసరం ఉందన్నారు. సమావేశంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోమాస బ్రహ్మానందం, జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం జనార్దన్, నాయకులు గోవర్ధన్, దానయ్య, రాజేందర్, ఆనంద్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ డివిజన్ హెచ్ఎమ్మెస్ బ్రాంచ్ కమిటీలను ఆదివారం ఎన్నుకున్నారు. ఆ యూనియన్ కార్యాలయం వద్ద జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా యూనియన్ అధ్యక్షుడు రియాజ్అహ్మద్ హాజరయ్యారు. బ్రాంచీ ఉపాధ్యక్షుడిగా తిప్పారపు సారయ్య, కార్యదర్శిగా వీ.అనిల్‌రెడ్డి, కోశాధికారిగా మీస కొమురయ్య, సహాయ కార్యదర్శిగా దుర్గం రవికిరణ్, దుర్గం వెంకటేశ్వర్లు, ఆరెల్లి రమేష్, దంతూరి శ్రీనివాస్, కొల్లూరి శ్రీనివాస్, కొట్టే సురేష్, కిరణ్ ఫ్రాన్సిస్, టీ నవీన్, ప్రతాప్, శ్రీనివాస్, ఐత వెంకటస్వామి, సుధాకర్, కే.అనిల్ కుమార్, పీ.అనిల్ కుమార్, వలీ, తదితరులు ఎన్నుకున్నారు.

కాంగ్రెస్ పార్టీలో సర్పంచ్‌ల చేరిక

జైపూర్: మండలం ఆయా గ్రామాల సర్పంచ్‌లు అధికార బీఆర్‌ఎస్ పార్టీని వీడి ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ ఎంపీ గడ్డం వివేక్‌వెంకటస్వామి, మాజీ విప్, మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గంగిపల్లి, కిష్టాపూర్, వేలాల, రామారావుపేట, వెంట్రావుపల్లి సర్పంచ్‌లు, మాజీ జెడ్పీటీసీ సత్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీటీసీ, నాయకులు కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

'ఎన్నికల్లో పోటీలో ఉంటా'

మందమర్రిరూరల్: టీడీపీ అధిష్టానం ఇంతవరకు అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలుస్తుందా..? లేదా..? అనే విషయంపై క్లారిటీ ఇవ్వలేదని, ఏదిఏమైనా ఈ నెల 9న తను నామినేషన్ వేయనున్నట్లు టీడీపీ పెద్దపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. చెన్నూర్ అసెంబ్లీ నుంచి ఎన్నికల బరిలో పార్టీ ఆదేశిస్తే నిలబడుతానని, లేకుంటే ఇండిపెండెంట్‌గా ఉంటానన్నారు.

పార్టీ శ్రేణులు సమన్వయంతో ఉండాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న కలవేన శంకర్

పాతమంచిర్యాల: సాధారణ ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులు ఎన్నికల పొత్తుల విషయంలో స్పష్టత వచ్చే వరకు సమన్వయంతో ఉండాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ పార్టీ సెక్యూలర్ భావాలు గల పార్టీలతో కలిసి ఎన్నికల్లో పని చేయాలనే ఆలోచన ఉన్న నేపథ్యంలో రాష్ట్ర కమిటీ నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదన్నారు. అప్పటి వరకు పార్టీ శ్రేణులు ఓపికతో ఉండాలన్నారు. రాష్ట్ర కమిటీ వైఖరీ వెలువడిన తర్వాత జిల్లాలోని నాయకులకు సమాచారం అందిస్తామన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాసు, ఖలీందర్ అలీఖాన్, రేగుంట చంద్రశేఖర్, వెంకట స్వామి, సుదర్శన్, వీరభద్రయ్య, చిప్ప నర్సయ్య, దాగం మల్లేష్, మామిడాల రాజేశం ఉన్నారు.

'బీఆర్‌ఎస్ మేనిఫెస్టో వివరిస్తూ ప్రచారం'



ఎర్రగుంటపల్లిలో ప్రచారం

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామంలో ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం చేపట్టారు. బీఆర్‌ఎస్ చెన్నూర్ నియోజకవర్గ అభ్యర్థి బాల్క సుమన్‌ను అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించాలని కోరుతూ గడపగడపకూ తిరిగి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టో కరపత్రాలతో ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ మడక స్వప్న, రవి, ఉప సర్పంచ్ రాజశేఖర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటపల్లి: చెన్నూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి బాల్కసుమన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్‌వీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సమ్మయ్య నాయక్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ఇంటింటా వివరిస్తూ బాల్కసుమన్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాపు, మల్లయ్య, రాజు, రాజబాపు, దాసు, పవన్, సంతోశ్ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి చిన్నయ్య



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లిరూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధిని చూసి ప్రజలు ఎన్నికల్లో మరోసారి ఆదరించాలని బెల్లంపల్లి బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్య అన్నారు. మండలంలోని లింగాపూర్, ఆకెనపల్లి, బుచ్చయ్యపల్లి, పాతబెల్లంపల్లి, కన్నాల గ్రామాల్లో ఆదివారం ఎన్నికల్లో భాగంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రజల దగ్గర ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సత్యనారాయణ, ఎంపీపీ శ్రీనివాస్, సర్పంచ్‌లు వెంకటేశం, ఉమాదేవి, మాధవి, స్వరూప, మాజీ ఎంపీపీ సుభాష్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు గణేష్ గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లలో సమస్య పరిష్కరిస్తా

కాసిపేట: బెల్లంపల్లి మండలం సోమగూడంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్యకు నిరసన సెగ తగిలింది. బెల్లంపల్లి, రామకృష్ణాపూర్‌తో పాటు పలు ప్రాంతాల్లో సింగరేణి ప్రాంతంలో ఇళ్లకు పట్టాలు ఇప్పించారని, కేవలం ఈ నియోజకవర్గంలోని సోమగూడంలో మాత్రమే పట్టాలు ఇవ్వలేదని నిలదీశారు. కేకే ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు నడుస్తున్నందునా సింగరేణి యాజమాన్యం ప్రభుత్వానికి అప్పగించలేదని, ప్రస్తుతం గెలిపిస్తే మరో రెండు సంవత్సరాల్లో పట్టాలు ఇప్పిస్తానని తెలిపారు. దీంతో స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను దృష్టిలో పెట్టుకొని తనను గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు.

అప్పుల పాలైన తెలంగాణ

- కేసీఆర్ కుటుంబ పాలనకు చరమగీతం పాడాలి
- కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీ వివేక్



వివేక్ సమక్షంలో చేరుతున్న మూల రాజిరెడ్డి

బెల్లంపల్లి/భీమారం: ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను సీఎం కేసీఆర్ రూ.5.50లక్షల కోట్లు అప్పులపాలు చేశారని కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీ గడ్డం వివేక్ విమర్శించారు. ఆదివారం బెల్లంపల్లి పద్మశాలి భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిమంద రమేష్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మంద స్వరూప, కన్నెపల్లి మండల బీఆర్‌ఎస్ నాయకుడు మాధవరపు నర్సింగరావు, బెల్లంపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిప్ప మనోహర్, తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి వివేక్‌తోపాటు ఏఐసీసీ పెద్దపల్లి పార్లమెంటు ఇన్‌చార్జి మోహన్‌జోషి, బెల్లంపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ అధికారాన్ని అడ్డం పెట్టుకుని రాష్ట్రాన్ని దోచుకున్న కేసీఆర్ కుటుంబ పాలనకు చరమగీతం పాడాలని అన్నారు. బెల్లంపల్లిలో టికెట్ ఆశించి భంగపడిన నాతరి స్వామి ఇంటికి వివేక్, వినోద్, మోహన్‌జోషి వెళ్లారు. సముచిత గుర్తింపు కల్పిస్తామని హామీనిచ్చారు.

– భీమారం మండలంలో మాజీ ఎంపీపీ మల్లేశ్వరి, బీఆర్‌ఎస్ నాయకులు చేకూర్తి సత్యనారాయణరెడ్డి, ఎల్కటూరి శంకరమ్మ, బన్సీలాల్ కాంగ్రెస్ పార్టీలో చేరగా.. వివేక్ కండువాలు కప్పి ఆహ్వానించారు.


'రాష్ట్రంలో అవినీతి పాలన'

చెన్నూర్/కాసిపేట: రాష్ట్రంలో అవినీతి, పాలన రాజ్యమేలుతోందని మాజీ ఎంపీ వివేక్ అన్నారు. ఆదివారం చెన్నూర్‌లోని ఎంఆర్‌ఆర్ గార్డెన్, కాసిపేట మండలం సోమగూడెంలో పలువురు పార్టీలో చేరగా వివేక్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు కండువా కప్పి ఆహ్వానించారు. చెన్నూర్‌లో బీఆర్‌ఎస్ మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, సహకార సంఘం చైర్మన్ చల్లా రాంరెడ్డి, సిర్సా మాజీ సర్పంచ్ గొడిసెల బాపురెడ్డి, నాయిని సతీశ్, మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ సర్పంచులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

మందమర్రిరూరల్: పట్టణంలోని పాత బస్టాండ్‌కు చెందిన అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు బండి సదానందం ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, పలు కుల సంఘాల నాయకులు ఆదివారం మాజీ ఎంపీ వివేక్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

శ్రీదేవి ఆధ్వర్యంలో బీజేపీలో చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీదేవి

బెల్లంపల్లి: మున్సిపాలిటీ శాంతిఖని బస్తీలో ఆదివారం బెల్లంపల్లి బీజేపీ అభ్యర్థి అమురాజుల శ్రీదేవి గడపగడపకూ వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. స్వయంగా ఇళ్లకు వెళ్లి ఓటర్లను కలిసి కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో భాగంగా బస్తీవాసులు పలువురు బీజేపీలో చేరారు. వారికి కమలం కండువా కప్పి శ్రీదేవి పార్టీలోకి చేర్చుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లం తిరుపతి, నాయకులు రాజులాల్, చిరంజీవి, సంగీత, మహేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.